ఐసీటీసీ సిబ్బందిని అభినందించిన కలెక్టర్

విద్యానగర్, జనవరి 27: ఐసీటీసీకి రాష్ట్ర స్థాయి అవార్డు రావడంపై సోమవారం ఐసీటీసీ సిబ్బందిని, వైద్యాధికారులను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. జిల్లాలో ఎక్కువ మందికి కౌన్సెలింగ్‌తో పాటు పరీక్షలు చేసి ఐసీటీసీ సెంటర్‌ను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపడంపై కౌన్సిలర్ సదానందాచారి, టెక్నిషియన్ శ్యాంసుందర్, హాస్పిటల్ హెచ్‌వోడీ డాక్టర్ దీప్తి, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డిని, ఆర్ఎంవో నవీనను అభినందించారు.

పీఎఫ్‌పై అపోలోలో అవగాహన

విద్యానగర్, జనవరి 27: కరీంనగర్‌లోని అపోలో రీచ్‌లో నిధి ఆప్కే నిక్కత్ పీఎఫ్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఎఫ్ సమస్యలను అక్కడే పరిష్కరించారు. ఇందులో భాగంగా ప్రయాస యోజన కింద ఈ నెలలో రిటైర్ అవుతున్న కార్మికులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీని అందించారు. కార్యక్రమంలో పీఎఫ్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్, అపోలో హాస్పిటల్స్ ఏవో డాక్టర్ నాగ సతీశ్, ఆనంద్ పటేల్, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కియా సిరోస్ కారు

కియా సిరోస్‌ను విడుదల చేస్తున్న డీటీసీ పురుషోత్తం

విద్యానగర్, జనవరి 27: కరీంనగర్‌లోని మలిక్ కియా షోరూంలో సోమవారం కియా సిరోస్ నూతన మోడల్ కారును కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం విడుదల చేశారు. గతంలోని కార్ల కంటే ఎన్నో ఫ్యూచర్లతో ఈ కియా సిరోస్‌ను రూపొందించారని, బేసిక్ వర్షన్ నుంచి టచ్ స్క్రీన్, డబుల్ డీకట్ స్టీరింగ్, 20 స్టాండర్డ్స్ సేఫ్టీ ఫీచర్స్ లాంటి సౌకర్యాలున్నాయని షోరూం ఎండీ కరణ్ మాలిక్ తెలిపారు. షోరూంలో సేల్స్, సర్వీస్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ హెడ్ గంజి సంజీవ్, మేనేజర్ ఫెరోస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు కాలనీలో ఉచిత మెగా వైద్య శిబిరం

విద్యానగర్, జనవరి 27: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం బ్యాంకు కాలనీ ప్రజలు, రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. మెడికవర్ హాస్పిటల్‌లో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. శిబిరంలో బ్యాంకు కాలనీకి చెందిన పి. రవీంద్ర కుమార్, ఎం. నరసింహస్వామి, ఎం. శ్రీనివాస్, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ కార్యవర్గం



వెంకటేశ్వర్లు



అంజయ్య

విద్యానగర్, జనవరి 27: తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సోమవారం భగత్‌నగర్‌లోని సంఘ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు చీకోటి శ్రీధర్, కార్యదర్శి గుండ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ, కార్మిక చట్టాలను కాల రాస్తున్న ఫార్మా యజమాన్యాలను శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. నూతనంగా అధ్యక్ష, కార్యదర్శులుగా కొండా వెంకటేశ్వర్లు, అంజయ్య మిరుపాల, ఉపాధ్యక్షులుగా పూదరి హరీశ్, కొక్కుల శ్రవణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా నరేందర్, మదన్‌మోహనాచారి, కోశాధికారిగా సంపత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మా మొర ఆలకించండి..

- పెండింగ్ సమస్యలు పరిష్కరించండి
- ఆరు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకుంట లేరు
- ప్రజావాణిలో పలువురి గోడు

కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

కలెక్టరేట్, జనవరి 27: 'ఆరు నెలలుగా అధికారుల వద్దకు తిరుగుతున్నా, మా సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనీసం కనికరించడం లేదు', మా మొర ఆలకించడం లేద'ని పలువురు ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతి ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన వారు, తమ సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకొని, కన్నీటి పర్యంతమయ్యారు. వెంటనే స్పందించిన ఆమె సంబంధిత అధికారులను హెచ్చరిస్తూ, దరఖాస్తులు త్వరగా పరిశీలించి, వారి సమస్యలు పరిష్కరించాలంటూ ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 298 మంది వివిధ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందజేయగా, వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు అప్పగించారు.

ఆర్‌వోబీ వెడల్పు పెంచేయత్నాలు ఆపాలి

నగరంలోని తీగలగుట్టపల్లిలో రైల్వే స్టేషన్ సమీపంలో మంచిర్యాల రహదారిపై వంద ఫీట్లలోపు మాత్రమే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గతంలో అప్పటి ఆర్ అండ్ బీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే, వాటిని పట్టించుకోకుండా 125 ఫీట్ల వెడల్పుతో నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మా ఇళ్ల సమీపంలోకి బ్రిడ్జి వచ్చింది. తిరిగి వెడల్పు పెంచితే మా ఇండ్లు మొత్తం కూల్చివేయాల్సి వస్తది. దీనిపై సంబంధితాధికారులను అడిగితే, స్మార్ట్‌సిటీకి అనుకూలంగా బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నామంటూ చెబుతున్నారు. ఇండ్లు కూల్చివేస్తే మాకు ప్రత్యామ్నాయం లేదు. కలెక్టర్ పరిశీలించి గతంలో మాదిరి 100 ఫీట్లలోపే ఆర్‌వోబీ నిర్మించేలా ఉన్నతాధికారులకు లేఖ రాయాలని విన్నవించాం.

-తీగలగుట్టపల్లివాసులు, కరీంనగర్

ఇందిరమ్మ ఇల్లు కేటాయింపులో అన్యాయం

అధికారులు ఇష్టారాజ్యంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారు. వృద్ధురాలినైన నాకు చింతకుంట సైట్ వన్ 12వ బ్లాకులో 7వ నంబర్ ఇల్లు పదేళ్ల క్రితం కేటాయించారు. వారికి అనుకూలంగా మెదిలిన వాళ్లకు మాత్రం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఇచ్చారు. అధికారుల తీరుతో నేను ప్రతి రోజు నాలుగుసార్లకు పైగా మెట్లు ఎక్కిదిగలేక పోతున్న. కొంతమంది దళారులతో కలిసిన అధికారులు, వారు చెప్పిన ప్రకారమే ఇండ్ల కేటాయింపు చేశారు. ఇప్పటికీ గ్రౌండ్ ఫ్లోర్, ఒకటో అంతస్తులో ఖాళీ ఉన్నా కూడా నాకు మాత్రం ఇవ్వడం లేదు. వృద్ధాప్యంతో పాటు అంగవైకల్యం ఉండడంతో నేను నానా తిప్పలు పడుతున్న. నాబాధ కలెక్టరమ్మకు చెప్పుకొంటేనన్నా నాకు న్యాయం జరుగుతుందని వచ్చిన.

-ముషికం సత్యవతి, చింతకుంట, కొత్తపల్లి మండలం

రాష్ట్రస్థాయి పోటీలకు మానేరు విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, జనవరి 27 : మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఈనెల 29 నుంచి జరుగనున్న 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్- 14 సాఫ్ట్ బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి అశ్విత్ తేజ ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, పీఈటీలు తిరుపతి, స్వామి, జహీదా, శిరీషతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

క్రీడాకారులకు సన్మానం

గంగాధర, జనవరి 27 : పటేల్స్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో గంగాధర జట్టు రెండో స్థానంలో నిలువగా, సోమవారం గంగాధర మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన జట్టు క్రీడాకారులను మండలంలోని మధురానగర్‌లో శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ కన్వీనర్ మడ్డపెల్లి శ్రీనివాస్, సభ్యులు సత్తు కనకయ్య, వైద భూపతి, వేముల భాస్కర్, వేముల అంజి, తూము నారాయణ, పెరుక శంకర్, తూము మల్లారెడ్డి, పెంచాల చందు, తూము తిరుపతి పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు 'ఆర్థిక భరోసా'

చొప్పదండి, జనవరి 27: నియోజకవర్గంలో గామా ఫౌండేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 130 పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాలో భాగంగా సోమవారం పట్టణంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ జోగు పాల్, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి ఆధ్వర్యంలో రూ. వెయ్యి చొప్పున నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, సురేశ్, రాకేశ్, ఎంపీవో అనుమల్ల రాజశేఖర్, దూస కైలాసపతి, ఎలిగేటి వెంకటేశం, సిరిపురం ఆంజనేయులు, వల్లాల సాయి కృష్ణ, ఇప్పనపల్లి రాజేశం, అనుమల్ల రమణ, సిరిపురం లింగమూర్తి, కళ్యాణం శ్రీనివాస్, వల్లాల వినయ్ కుమార్, నాయకుడు పెరుమండ్ల గంగయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

విద్యానగర్, జనవరి 27: లయన్స్‌క్లబ్ కరీంనగర్ జిల్లా గవర్నర్ చిదుర సురేశ్ జన్మదినం సందర్భంగా సోమవారం నగరంలోని ఆశాజ్యోతి హెచ్ఐవీ పాజిటివ్ పీపుల్స్ వెల్ఫేర్ సొసైటీ ఆఫీసులో 20 మంది పేద పిల్లలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు మమత, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

మానకొండూర్ రూరల్, జనవరి 27: ఊటూర్ గ్రామంలో సోమవారం లయన్ చిదుర సురేశ్ జన్మదినం పురస్కరించుకొని, కరీంనగర్ లయన్స్ క్లబ్, లయన్ ఆఫ్ రామగుండం ముద్దసాని ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 98 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి రేకుర్తి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు.

వాసవీ క్లబ్ ఔదార్యం

వీణవంక, జనవరి 27: మండల కేంద్రానికి చెందిన అయిత సత్యనారాయణ మృతి చెందగా, సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు క్లబ్ అధ్యక్షుడు రామిడి శ్రీనివాస్(శ్రీధర్), కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్థిక సాయంగా రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ కమిటీ సభ్యులు అల్లెంకి రమేశ్, విశ్వంభర్, సాంబమూర్తి, పున్నంచందర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, జనవరి 27: బొమ్మకల్‌లో పరంపోగు భూముల్లో గతంలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించి కొందరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని దొమ్మటి బాబు అనే వ్యక్తి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపించి, భూమిని కాపాడాలని కోరారు.

ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ రూరల్, జనవరి 27: ఇరుకుల్ల గ్రామంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఇటుక బట్టీలను రద్దు చేయాలని గ్రామ నాయకుడు కాశిపాక రాకేశ్ బృందం సోమవారం కరీంనగర్‌లో ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. పలువురు ఇటుకబట్టీల నిర్వాహకులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, కొత్త ఇటుక బట్టీలు సైతం ఏర్పాటు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గంగాధర, జనవరి 27: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని మాజీ వైస్ ఎంపీపీ కర్ర బాపురెడ్డి పేర్కొన్నారు. నాయకుడు వొడ్నాల యజ్ఞేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతగా నిలిచిన మోతె శ్రీనివాస్‌రెడ్డి, రన్నరప్ సారబుడ్ల ప్రశాంత్ జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోతె నర్సింహారెడ్డి, ముద్దం నగేశ్, ముక్కెర మల్లేశం, సముద్రాల అజయ్, దోమకొండ మహేశ్, పిట్టల మల్లేశం, హరికిషన్, కమలాకర్, మహేశ్, బాబుమియా, జగదీశ్, శ్రీనివాస్, ప్రవీణ్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సోదరి కుటుంబానికి రసమయి పరామర్శ



సకలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, తదితరులు

తిమ్మాపూర్, జనవరి 27: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోదరి చీటీ సకలమ్మ ఇటీవల మృతి చెందగా, హైదరాబాద్‌లో ఆమె కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావుతో కలిసి సకలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పరామర్శ

హైదరాబాద్‌లో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, జనవరి 27: మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన ప్రణీత్, సునీల్ హైదరాబాద్‌లో పటాకులు పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడగా, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో జరిగిన భారతమాత మహాహారతి కార్యక్రమంలో పటాకులు పేలిన సమయంలో ప్రమాదవశాత్తు హుస్సేన్ సాగర్‌లో ఉన్న రెండు బోట్లకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో వల్భాపూర్ గ్రామానికి చెందిన ప్రణీత్, సునీల్ గాయపడి యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, వారిని సోమవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించి, ధైర్యం చెప్పారు.

పదో తరగతి విద్యార్థులకు వీర్ల అల్పాహారం



అల్పాహారం అందించడంపై కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థినులు

రామడుగు, జనవరి 27 : రామడుగు మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అల్పాహారం పంపిణీకి చేయూతనందించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మజ తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం అల్పాహారం పంపిణీ ప్రారంభించినట్లు చెప్పారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యేంత వరకు ఈ అల్పాహారం పంపిణీ కొనసాగుతుందన్నారు. కాగా, ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం అందించడంపై వీర్ల వెంకటేశ్వరరావుకు హెచ్ఎం పద్మజతో పాటు పదో తరగతి విద్యార్థులు, వారి తల్లితండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్ సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రావణ్‌కుమార్

శ్రావణ్‌కుమార్

సైదాపూర్, జనవరి 27: కేటీఆర్ సేన హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన రుద్రారపు శ్రావణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఏరుకొండ ఇందిరాసుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అధికార ప్రతినిధిగా సంపత్

తిమ్మాపూర్, జనవరి 27: బీఆర్ఎస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా మండలంలోని మొగిలిపాలెం గ్రామానికి చెందిన వంతడుపుల సంపత్ నియామకమయ్యారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం మానకొండూర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సంపత్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషిచేసిన పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, మాజీ ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇనుకొండ శైలజా జితేందర్ రెడ్డి, నాయకులు ఉల్లెంగుల ఏకానందం, పాశం అశోక్ రెడ్డికి సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే గంగులను విమర్శిస్తే సహించేది లేదు

తెలంగాణచౌక్, జనవరి 27: పార్టీ మారిన మేయర్ సునీల్ రావు ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను విమర్శిస్తే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బీసీ సంక్షేమ మహిళా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజమల్లురాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ, పదవుల కోసం పార్టీలు మారే సునీల్‌రావుకు ప్రజలు రాజకీయంగా గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మురళి, సరోజన పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

చొప్పదండి, జనవరి 27: పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ స్వాతి అధ్యక్షతన విద్యార్థులకు 'లక్ష్య సాధన' అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ ఆర్ ఆర్ పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బెస్తపు ప్రభాకర్.. విద్యార్థులకు భవిష్యత్తుకు సంబంధించి మార్గదర్శనం చేశారు. పోటీ పరీక్షల్లో ఏ విధంగా రాణించవచ్చో వివరించారు. ఈ సందర్భంగా గురుకుల సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, రత్న రాణి, అలివేలు, పలువురు గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త రిమాండ్

వీణవంక, జనవరి 27: మండల కేంద్రానికి చెందిన మారుపాక రమ్య ఆత్మహత్య కేసులో నిందితుడైన ఆమె భర్త నీల సాయికిరణ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నీల సాయికిరణ్ రెండు సంవత్సరాల క్రితం రమ్యను వివాహం చేసుకున్నాడు. రోజూ తాగివచ్చి దూషిస్తూ, కట్నం తీసుకురాలేదని వేధించగా, రమ్య ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి మేన మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరిపారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ సోమవారం సాయికిరణ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆయన కళ్లు సజీవం



సత్యనారాయణ

వీణవంక, జనవరి 27: మండల కేంద్రానికి చెందిన అయిత సత్యనారాయణ (62) గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి డీలర్ గర్రెపెల్లి వెంకటేశ్వర్లు, రామిడి శ్రీనివాస్ (శ్రీధర్), కంభంపాటి శివశంకర్ నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో, వరంగల్ ఎల్వీపీ టెక్నీషియన్ ప్రదీప్ సహకారంతో నేత్రాలు సేకరించి హైదరాబాద్ ఐవీపీ ఐ బ్యాంక్‌కు పంపించారు. నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన సత్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు డీలర్లు వెంకటేశ్వర్లు, రామిడి శ్రీనివాస్, శివశంకర్, రమేశ్, శ్రీనివాస్‌కు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి భీష్మాచారి, సభ్యులు పాల్గొన్నారు.

నేడు మహిళా డిగ్రీ కళాశాలలో 'ఫెరియా ఫిస్టా'

కమాన్‌చౌరస్తా, జనవరి 27 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం 'ఫెరియా ఫిస్టా -2025' పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డీ వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రాంగణంలో ఫిస్టా పోస్టర్‌ను అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఇందులో పలు రకాల స్టాళ్లు ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థినులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పారమిత విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, జనవరి 27 : నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో మంకమ్మతోటలోని పారమిత స్కౌట్స్, గైడ్స్ తమ అద్భుత ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నట్లు పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా అద్భుత ప్రదర్శన ఇచ్చిన పారమిత స్కౌట్స్, గైడ్స్‌ని కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంసాపత్రాలతో అభినందించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

వేసవి విద్యుత్ కార్యాచరణపై సమీక్ష రేపు

ముకరంపుర, జనవరి 27: వేసవి విద్యుత్ కార్యాచరణపై కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం జిల్లా నోడల్ అధికారి ఎం అన్నపూర్ణ దేవి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని ఎస్ఈ రమేశ్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురోగతిలో ఉన్న పనులు, వేసవిలో నిరంతరాయంగా సరఫరాను అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జనవరి 27: రేకుర్తి 11కేవీ ఫీడర్‌లో కొత్త లైన్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రేకుర్తి, పాతవాడ, లయోల కాలేజీ, హనుమాన్ నగర్, ఇందిరమ్మ కాలనీ, కంటి హాస్పిటల్ ఏరియా, బుడిగ జంగాల కాలనీకి విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సబ్ స్టేషన్ ఆపరేటర్‌పై సస్పెన్షన్ వేటు

ముకరంపుర, జనవరి 27: చొప్పదండి మండలం ఆర్నకొండ సెక్షన్ పరిధిలోని చిట్యాలపల్లి సబ్‌స్టేషన్ ఆపరేటర్ బీ వెంకటేశ్వర్లును కరీంనగర్ రూరల్ డీఈ ఎం తిరుపతి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 3న మద్యం మత్తులో విధులు నిర్వహిస్తూ పట్టుబడగా, గుండి ఏడీఈ విచారణ చేపట్టి డీఈ కార్యాలయానికి నివేదిక సమర్పించారు. ఈ మేరకు ఆపరేటర్‌పై చర్యలు తీసుకున్నట్లు డీఈ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్ రూరల్, జనవరి 27: సింగాపూర్ గ్రామ శివారులోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మందాడిపల్లి గ్రామానికి మామిడాల రవీందర్‌రెడ్డి(52) కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా, సింగాపూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో రవీందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రవీందర్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రత్యేకాధికారి బాధ్యతల స్వీకరణ

హుజూరాబాద్ టౌన్/జమ్మికుంట, జనవరి 27: హుజూరాబాద్, జమ్మికుంట పురపాలక సంఘాల ప్రత్యేకాధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్లు ఎస్ సమ్మయ్య, ఎండీ అయాజ్ ఇతర ఉద్యోగులు ప్రత్యేకాధికారికి పుష్ప గుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. హుజూరాబాద్‌లో ప్రత్యేకాధికారి ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. త్వరలోనే అధికారులందరితో రివ్యూ మీటింగ్ నిర్వహించి, పట్టణాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే కనకయ్య, ఎంపీడీవో సునీత, తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీ హఠాన్మరణం



గుజ్జుల భారతి(ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 27: నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి సతీమణి, రామకృష్ణకాలనీ మాజీ ఎంపీటీసీ గుజ్జుల భారతి సోమవారం హఠాన్మరణం చెందారు. రెండు రోజులుగా స్వల్ప అనారోగ్యానికి గురైన ఆమెను కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఈ క్రమంలో సోమవారం పరిస్థితి విషమించగా, హైదరాబాద్ తరలించి చికిత్స ప్రారంభించే లోపే ఆమె మృతి చెందారు. రామకృష్ణ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబాన్ని పలువురు నాయకులు, గ్రామస్తులు పరామర్శించారు.

వరదకాలువ వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం

గంగాధర, జనవరి 27: మండలంలోని కురిక్యాల కొండన్నపల్లి గ్రామాల మధ్య వరదకాలువ వద్ద సోమవారం గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్లు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. వరదకాలువ వద్ద మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభంనాగర్లే, చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో క్లూస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మహిళ వయసు 26 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని, మెడపై చున్నీతో చుట్టి హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం ఘటనకు సంబంధించి పూర్తి వెల్లడిస్తామని తెలిపారు.

మత్స్యగిరీంద్రుడి ఆలయ అభివృద్ధికి కృషి

శంకరపట్నం, జనవరి 27: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులతో కలిసి గుట్టపై నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఫిబ్రవరి 4-19 వరకు జరుగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల (జాతర) పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రసాదాల కౌంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ తిరుపతి, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య, నాయకులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గన్నేరువరం, జనవరి 27: మండలంలోని పారువెల్లలో రూ.10లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, నాయకులతో పాటు మాజీ సర్పంచ్ సంగు దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గంగాధర, జనవరి 27: మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన కోటగిరి సావిత్రమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే, గ్రామానికి చెందిన గడ్డం జీవన్ ప్రమాదంలో గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి రాగా.. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు దూలం శంకర్‌గౌడ్, గడ్డం స్వామి తదితరులు ఉన్నారు.

'ఆలయ ఫౌండేషన్' ఆదరణ

- ప్రమాదంలో కాలుకోల్పోయిన యువకుడికి కృత్రిమ కాలు అందజేత

బాధితుడితో ఆలయ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ గుణసాగర్

జమ్మికుంట, జనవరి 27: ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన నిరుపేద యువకుడిని ఆలయ ఫౌండేషన్ ఆదరించింది. బాధితుడికి ఉచితంగా కృత్రిమ కాలు అందజేసి ఉదారతను చాటుకున్నది. వివరాల్లోకెళ్తే.. జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామానికి చెందిన బుర్ర అరుణ్‌కుమార్ గౌడ్ గీతకార్మికుడు. కులవృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలల క్రితం జరిగిన ప్రమాదంలో అతడి ఎడమ కాలు విరిగిపోయింది. శస్త్ర చికిత్స అనంతరం కాలును వైద్యులు తొలగించారు. అప్పటి నుంచి అరుణ్ గౌడ్ ఇబ్బందులు పడుతున్నారు. ఆయన పరిస్థితిని ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి(ఐఏఎస్) దృష్టికి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత తీసుకెళ్లారు. దీంతో ఆలయ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ గుణసాగర్ ఆధ్వర్యంలో అరుణ్‌గౌడ్‌ను నరహరి(ఐఏఎస్)చొరవతో శ్రీభగవాన్ మహావీర్ ట్రస్ట్(హైదరాబాద్) సౌజన్యంతో ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి బాధితుడికి కృత్రిమ కాలును ఇక్కడకు తెప్పించి ఉచితంగా ఆలయ ఫౌండేషన్ అందించింది. బాధితుడికి తొడిగించింది. కృత్రిమ కాలును ఉచితంగా అందించిన ఆలయ ఫౌండేషన్ నిర్వాహకుడు నరహరితోపాటు, కో-ఆర్డినేటర్ గుణసాగర్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327012-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189